

సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో సిల్వర్ ఓక్ మొక్కను నాటి నీరు పోస్తున్న ఎంపీ సంతోష్‌కుమార్

# గ్రీన్ ఇండియా చాలెంజ్‌ను కొనసాగిస్తాం

- రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్
- ఎర్రవల్లిలో మొక్కను నాటిన ఎంపీ

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): హరిత భారతదేశాన్ని సృష్టించేందుకు గ్రీన్ ఇండియా చాలెంజ్‌ను కొనసాగిస్తామని గ్రీన్ ఇండియా వ్యవస్థాపకుడు, రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ తెలిపారు. పర్యావరణ రక్షణతోపాటు మొక్కలు నాటడం ద్వారా మన ప్రకృతిని కాపాడుకొనేందుకు గ్రీన్ ఇండియా చాలెంజ్ సంప్రదాయాన్ని కొనసాగిస్తామని చెప్పారు. గురువారం సంతోష్‌కుమార్ తన పుట్టినరోజు సందర్భంగా ఎర్రవల్లిలోని నివాసంలో గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా సిల్వర్ ఓక్ మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టినరోజుతోపాటు సందర్భం ఏదైనా మొక్కలు నాటే సంప్రదాయాన్ని ప్రతి ఒక్కరూ కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా చాలెంజ్ కో-ఫౌండర్ రాఘవ, శ్రవణ్‌రెడ్డి, కిశోర్‌గౌడ్ తదితరులున్నారు.

# అక్రమ మొబైల్ కనెక్షన్లు 55 లక్షలు

- దేశవ్యాప్తంగా 1.31 లక్షల సిమ్‌లతో సైబర్, ఆర్థిక నేరాలు
- నకిలీ డాక్యుమెంట్లతో సిమ్ కార్డులు అమ్మిన 70 వేల ఏజెన్సీలు
- కేంద్రం వెల్లడి.. సంచార్ సాథి వెబ్‌సైట్‌లో చెక్ చేసుకొనే అవకాశం

ఖమ్మం జిల్లా వైరా మండలానికి చెందిన గీత కార్మికుడు వెంకటేశ్వర్లు ఇంటికి ఒక రోజు కర్ణాటకలోని గుల్బర్గా పోలీసులు వచ్చారు. గుల్బర్గాలోని చౌరస్తా స్టేషన్ పరిధిలో జరిగిన ఓ హత్య కేసు విచారణ జరుపుతుండగా.. అక్కడ ఒక సిమ్ లభించిందని, అది వెంకటేశ్వర్లు పేరు మీద ఉన్నదని చెప్పారు. వాస్తవానికి వెంకటేశ్వర్లు నిరక్షరాస్యుడు. అప్పటికి అతడు ఫోన్ కూడా వాడలేదు. పోలీసుల విచారణలో అతడు చెప్పేది నిజమేనని తేలింది. వెంకటేశ్వర్లు పేరుతో కర్ణాటకలో సిమ్ తీసుకున్న పత్రాలను పరిశీలించగా, వేలిముద్రకు బదులు సంతకాలు చేశారని పోలీసులు గుర్తించారు. దీంతో గుల్బర్గాలో సిమ్‌కార్డు అమ్మిన ఏజెంట్ దగ్గర తీగలాగగా.. ఖమ్మంలోని ఓ జిరాక్స్ సెంటర్ నుంచి వెంకటేశ్వర్లుకు చెందిన డాక్యుమెంట్లు మోసగాళ్ల చేతిలో పడి గుల్బర్గా వరకు చేరుకున్నాయని తేల్చారు. అయినా వెంకటేశ్వర్లు కర్ణాటకలో కోర్టు చుట్టూ తిరగక తప్పలేదు.

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): గతంలో సిమ్ నిబంధనలు కఠినంగా లేని సమయంలో సిమ్ ఏజెన్సీల్లో విచ్చలవిడిగా నకిలీ, ఫోర్జరీ డాక్యుమెంట్లతో సిమ్స్ అమ్మేవారు. ఒక వ్యక్తి డాక్యుమెంట్లు సమర్పిస్తే.. అతడికి తెలియకుండా పదుల సంఖ్యలో సిమ్ములు యాక్టివేట్ చేసి మోసగాళ్లకు ఇచ్చేవారు. వారు వాటిని సైబర్ నేరాలు, ఆర్థిక నేరాలతోపాటు ఇతర నేరాల్లో ఉపయోగించేవారు. ఫలితంగా అమాయకులు పోలీసులు, కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇలా దేశవ్యాప్తంగా ఉన్న అనుమానాస్పద మొబైల్ కనెక్షన్లను కేంద్ర టెలికం శాఖ గుర్తించి, వాటిని తొలగిస్తున్నది. ఆ వివరాలను తాజాగా పార్లమెంట్‌కు వెల్లడించింది. దీని ప్రకారం ఇప్పటివరకు గుర్తించిన అనుమానాస్పద ఫోన్ నంబర్లు 67 లక్షలు. వీటన్నింటినీ పరిశీలించి 55.52 లక్షల అక్రమ కనెక్షన్లు ఉన్నట్టు నిర్ధారించారు. నకిలీ, ఫోర్జరీ డాక్యుమెంట్లతో వీటిని తీసుకున్నట్టు తేల్చారు. మొత్తం 70 వేల సిమ్ విక్రయ ఏజెన్సీలు ఈ ఫేక్ సిమ్స్ రాకెట్‌లో భాగస్వామి అని గుర్తించారు. ఆ ఏజెన్సీలపై నిషేధం విధించారు.

### ఆర్థిక, సైబర్ నేరాలు

నకిలీ డాక్యుమెంట్లతో సిమ్‌లు తీసుకున్న వారిలో కొందరు తమ వ్యక్తిగత అవసరాల కోసం వినియోగిస్తే, మరికొందరు సైబర్, ఆర్థిక నేరాల కోసం వినియోగించారు. ఇలా 2.78 లక్షల సిమ్ కార్డులను నేరాల కోసం వినియోగించినట్టు వారు గుర్తించారు. వాటన్నింటినీ బ్లాక్ చేయించారు. మొత్తం 1,31,961 మొబైల్ ఫోన్లలో ఈ సిమ్ములను వాడినట్టు తేల్చి, వాటిని రద్దు చేశారు. ఈ సిమ్ కార్డులు అమ్మిన 1,890 మంది సిమ్ ఏజెంట్లపై కేసులు నమోదు చేశారు. మరోవైపు స్పూఫ్ కాల్స్‌పైనా దృష్టిసారించినట్టు కేంద్రం తెలిపింది. ఇలాంటివాటిని గుర్తించి, నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్నట్టు వెల్లడించింది. గత మూడేండ్లలో 65 ఏజెన్సీలపై కేసులు నమోదు చేసినట్టు వివరించింది.

### మనమే చెక్ చేసుకునే అవకాశం

మన పేరు మీద మనం వినియోగించే సిమ్ కార్డులు తప్ప ఇంకా ఏవైనా ఉన్నాయేమో చెక్ చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. సంచార్ సాథి పేరుతో ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చింది. www.sancharsaathi.gov.in అనే వెబ్‌సైట్‌కు వెళ్లి మొబైల్ కనెక్షన్ ఇన్ యువర్ నేమ్ అనే ఆప్షన్‌ను క్లిక్ చేయాలి. తర్వాత మన ఫోన్ నంబర్, ఓటీపీతో లాగిన్ అయితే.. మన ఆధార్ నంబర్‌తో ప్రస్తుతం ఎన్ని సిమ్‌కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయో చూపిస్తుంది. అందులో ఉన్న నంబర్లు మీవి కాకపోతే 'నాట్ మై నంబర్' అనే ఆప్షన్ ఇచ్చి ఫిర్యాదు చేయవచ్చు. వినియోగించని నంబర్లు ఉంటే 'నాట్ రిక్వైర్డ్' ఆప్షన్ ఇచ్చి సర్వీస్‌ను రద్దు చేసుకోవచ్చు.

## సమావేశాన్ని వాయిదా వేయండి

### కేంద్రజల్‌శక్తికి తెలంగాణ విజ్ఞప్తి

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): సాగర్ డ్యామ్ దురాక్రమణ నేపథ్యంలో వివాద పరిష్కారం కోసం శుక్రవారం నిర్వహించనున్న సమావేశాన్ని వాయిదా వేయాలని కేంద్ర జల్‌శక్తిశాఖకు తెలంగాణ సర్కారు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కేంద్ర జల్‌శక్తి శాఖకు సీఎస్ శాంతికుమారి లేఖ రాశారు. కృష్ణా జలాల పంపిణీ వివాద పరిష్కారం, నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నిర్వహణ అంశాలపై కూలంకషంగా చర్చించేందుకు ఇరు తెలుగు రాష్ట్రాలతో కేంద్రం ఇప్పటికే ఒక దఫా సమావేశాన్ని నిర్వహించింది. పూర్తిస్థాయిలో మరోసారి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించాలని నిర్ణయించింది. అయితే రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటు ఇంకా పూర్తిస్థాయిలో కాలేదని, ఈ నేపథ్యంలో నేటి సమావేశాన్ని వాయిదా వేయాలని సీఎస్ కోరారు. జనవరిలో సమావేశాన్ని నిర్వహించాలని కేంద్ర జల్‌శక్తిశాఖకు విజ్ఞప్తి చేశారు.

## పారా మెడికల్ సీట్ల భర్తీకి నోటిఫికేషన్

వరంగల్ చౌరస్తా, డిసెంబర్ 7: పారా మెడికల్ కోర్సులో ప్రవేశాలకు కాకతీయ వైద్య కళాశాల నోటిఫికేషన్ విడుదల చేసింది. డిప్లొమా కోర్సుల ప్రవేశాలకు ఈనెల 28, 29వ తేదీల్లో అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దివ్వెల మోహన్‌దాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల విద్యార్థులు విభాగాల వారీగా కేఎంసీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. 28న డిప్లొమా ఇన్ కార్డియాలజీ, డిప్లొమా ఇన్ డయాలసిస్, డీఏఎన్‌ఎస్, డీఎంఎస్‌టీ, డీవోఏ, డీఈపీటీ కోర్సులకు, 29న డీఎంసీటీ, డీఆర్ఈఎస్‌టీ, డీఈసీజీ, డీఆర్‌జీఏ, డీఎంఐటీ, డీడీఆర్‌ఏ కోర్సులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు తమ పూర్తి ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

## ఏపీ ఇండెంట్‌పై అభిప్రాయం చెప్పండి

- తెలంగాణకు కేఆర్ఎంబీ లేఖ

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): నాగార్జునసాగర్ డ్యామ్ నుంచి 5 టీఎంసీల జలాలను విడుదల చేయాలని ఏపీ పెట్టిన ఇండెంట్‌పై అభిప్రాయం చెప్పాలని తెలంగాణ సర్కారును కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) కోరింది. ఈ మేరకు తెలంగాణ సాగునీటిపారుదలశాఖకు కేఆర్ఎంబీ లేఖ రాసింది. సాగర్ డ్యామ్ నుంచి నీటి విడుదలకు సంబంధించి ఏపీ ఇచ్చిన ఇండెంట్‌పై సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోవాలని కేఆర్ఎంబీకి ఇప్పటికే కేంద్ర జలశక్తిశాఖ ఆదేశించిన విషయం తెలిసిందే. ఇప్పటికే త్రిసభ్య కమిటీ సమావేశాన్ని నిర్వహించగా, ఆ సమావేశానికి తెలంగాణ సర్కారు తరపున ఎవరూ హాజరు కాలేదు. దీంతో తెలంగాణ అభిప్రాయం తీసుకున్న అనంతరం ఆ అంశంలో నిర్ణయం తీసుకుంటామని ఏపీకి కేఆర్ఎంబీ తెలిపింది. ఈ నేపథ్యంలో తెలంగాణ సర్కారుకు కేఆర్ఎంబీకి తాజాగా లేఖను రాసింది.

- నిధి ట్రోఫీ అందజేత

*సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా అత్యధిక విరాళాలు సేకరించినందుకు హైదరాబాద్ సైనిక సంక్షేమాధికారి శ్రీనేశ్‌కుమార్ నోరికి సాయుధ దళాల పతాక దినోత్సవ నిధి ట్రోఫీని రాజ్‌భవన్‌లో అందజేస్తున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్.*

– హైదరాబాద్, నమస్తే తెలంగాణ

## కొత్తగా 29 'స్కిల్' కోర్సులు

- ఇంటర్ ఉత్తీర్ణతతో 3-6 నెలల సర్టిఫికెట్ కోర్సులు
- యూజీసీ మార్గదర్శకాలు

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలను మరింత పెంచాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిర్ణయించింది. ఈ మేరకు ఇంటర్ ఉత్తీర్ణత అర్హతతో కొత్తగా 29 స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను ప్రవేశ పెట్టాలని నిర్ణయించింది. గురువారం ఢిల్లీలో జరిగిన యూజీసీ సమావేశంలో ఇందుకు సంబంధించిన పలు మార్గదర్శకాలను విడుదల చేశారు. దేశంలోని అన్ని ఉన్నత విద్య సంస్థలలో ఈ కోర్సులను అందించవచ్చని యూజీసీ చైర్మన్ మామిడాల జగదీశ్‌కుమార్ తెలిపారు.

### కొత్త కోర్సులు

యూజీసీ కొత్తగా తీసుకురాబోతున్న సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి ఇంటర్మీడియట్‌ను అర్హతగా నిర్ణయించారు. వీటిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ రోబోటిక్స్, డాటా సైన్స్ అండ్ అనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్, వర్చువల్ రియాలిటీ, అగ్మెంటెడ్ రియాలిటీ అండ్ ఎక్స్‌టెండెడ్ రియాలిటీ, సైబర్ సెక్యూరిటీ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్, 5జీ కనెక్టివిటీ, డిజిటల్ ఫ్లూయెన్సీ, ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్, బేసిక్ కోడింగ్(కంప్యూటర్ లాంగ్వేజెస్), యోగిక్ సైన్సెస్, ఫ్యాషన్ టెక్నాలజీ అండ్ ఫ్యాషన్ డిజైనింగ్, ఫైనాన్షియల్ టెక్నాలజీ, హెల్త్ అండ్ వెల్‌నెస్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ప్రాసెస్ ఆటోమేషన్(ఆర్‌పీఏ), సైబర్ సెక్యూరిటీ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్, ఎలక్ట్రానిక్ సిస్టర్ డిజైన్స్, కంప్యూటర్ ఎయిడెడ్ డిసైన్(కాడ్), కంప్యూటర్ ఎయిడెడ్ మ్యానుఫ్యాక్చరింగ్ (కామ్), మెకానికల్ టూలింగ్ అండ్ ప్రాసెస్, ఆర్కిటెక్చరల్ డ్రాఫ్టింగ్, బేసిక్ 3డీ డిజైన్, బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మాడలింగ్(బీఐఎమ్), 3డీ ప్రింటింగ్, ఎలక్ట్రీషియన్ అండ్ ఎలక్ట్రానిక్స్, మొబైల్ కమ్యూనికేషన్ అండ్ మొబైల్ రిపేరింగ్, డిజిటల్ మార్కెటింగ్, ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సులు ఉన్నాయి.

## ఏపీలో గ్రూప్-2 నోటిఫికేషన్

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదల చేసింది. 897 పోస్టులతో నోటిఫికేషన్ విడుదలైంది. ఎగ్జిక్యూటివ్ పోస్టులు 331, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు 566లకు ఫిబ్రవరి 25 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నెల 21 నుంచి జనవరి 10 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. నూతన సిలబస్, నూతన నియామక ప్రక్రియలో పోస్టులను భర్తీ చేయనున్నారు. డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

## 17 నుంచి ధనుర్మాసోత్సవం

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): ఈ నెల 17 నుంచి తిరుమలలో ధనుర్మాస ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. తొలిరోజు తెల్లవారుజామున బ్రహ్మ ముహూర్తానికి గంటన్నర ముందుగా తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారికి సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై సేవతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం భోగ శ్రీనివాసమూర్తికి బదులుగా శ్రీకృష్ణస్వామి వారికి సేవ నిర్వహిస్తారు.